బాధితులకు భరోసా

దంచి కొట్టిన వర్షాలకు పాతనగరంలోని అనేక ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు అనేక మంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బాధితులను గురువారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ పరామర్శించి.. వారికి ధైర్యం చెప్పారు. ప్రజా జీవనానికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటామని ప్రజలకు భరోసా కల్పించారు.

- ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే వాసుపల్లి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ
- వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం
- బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పిన వైనం


ముంపు ప్రాంతంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్


రామకృష్ణనగర్ వద్ద బాధితురాలితో మాట్లాడుతున్న కమిషనర్

జగదాంబ : తుపాను కారణంగా ముంపునకు గురైన బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పరామర్శించారు. జీవీఎంసీ 39వ వార్డులో లోతట్టు ప్రాంతాలైన ప్రసాద్‌గార్డెన్స్, జనతాబజార్, రామకృష్ణనగర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించి నిర్వాసితులతో మాట్లాడారు. రామకృష్ణనగర్ వద్ద ఇళ్లలోకి నీళ్లు వెళ్లిపోయి నిత్యావసర వస్తువులు సైతం కోల్పోయిన వారికి ఆర్థిక సాయం చేశారు. అలాగే పోర్టులో ఎస్‌ఎల్ కెనాల్‌కు నీటి ప్రవాహం నిలిచిపోయిందని, సంబంధిత అధికారులతో మాట్లాడి నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి, ఖాజావలీ, చిన్ని, ఆదివిష్ణు, బొగ్గు శ్యామ్, మంగరాజు, గౌరీశంకర్, సురేష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పాతనగరంలో జీవీఎంసీ కమిషనర్ పర్యటన

జగదాంబ : అల్పపీడనం కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అన్నారు. వర్షం వల్ల ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాలను గురువారం ఉదయం ఆయన పరిశీలించారు. నీట మునిగిన వెలంపేట, లక్ష్మీనగర్, పాతపోస్టాఫీసు, 75 ఫీట్‌రోడ్డు, తారకరామనగర్, చిలకవీధి, ఎస్‌ఎల్ కెనాల్ ప్రాంతాల్లో పర్యటించి ముంపు బాధితులతో మాట్లాడారు. వ్యాధులు ప్రబలకుండా వెంటనే ముంపు ప్రాంతాలను పరిశుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చిన్న,పెద్ద కాలువల్లో పూడికలు తొలగించాలని అదనపు కమిషనర్ సన్యాసిరావును ఆదేశించారు. ఎస్‌ఎల్ కెనాల్ నుంచి సముద్రంలోకి ప్రవేశించే వర్షపు నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా పోర్టు అధికారులతో మాట్లాడి సమన్వయం చేసుకుని కెనాల్ పూడికలు తీయించాలన్నారు. నిల్వ ఉన్న వర్షపు నీటిలో దోమల లార్వాలు వృద్ధి చెందకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. స్ప్రేయింగ్, బ్లీచింగ్, ఫాగింగ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తక్షణ చర్యల కోసం సంబంధిత సచివాలయాల సెక్రటరీలకు తెలియపరచాలని కమిషనర్ చెప్పారు.

జ్ఞానాపురంలో..జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం ముంపు ప్రాంతాల్లో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, జోన్-5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ గురువారం పర్యటించారు. ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జ్ఞానాపురం లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఎర్రిగెడ్డలో సక్రమంగా పూడికలు తొలగించకపోవడంతో భారీ వర్షాలకు సమీప కాలనీల్లోకి నీరు చేరిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యుద్ధప్రాదికన జేసీబీలతో పూడికలు తొలగించే ప్రక్రియను పరిశీలించారు. అనంతరం సెబాస్టియన్‌కాలనీ, బాబుకాలనీ, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, గెడ్డవీధి, రాచవీధి, పలు వీధుల్లో పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భారీ వర్షాలు పడుతున్నందున లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ఎర్రిగెడ్డ కెనాల్స్ వద్ద చెత్తచెదారాలు తొలగిస్తున్న ప్రక్రియను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జోనల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


లోతట్టు ప్రాంత సమస్యలపై అధికారులకు ఆదేశాలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ


ఎస్‌ఎల్ కెనాల్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ


బురదమయంగా మారిన రహదారిని పరిశీలిస్తున్న కమిషనర్


ఎర్రిగెడ్డలో జేసీబీ సాయంతో పూడికలు తొలగిస్తున్న దృశ్యం

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసిపూజ

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రానవావర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో పూజా రుసుము చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.


సహస్ర తులసి పూజలో సిరులతల్లి

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

మర్యాద పూర్వక కలయిక


కోలాను అభినందిస్తున్న మన్యాల శ్రీనివాస్, కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు


కోలా గురువులుకు అభినందనలు తెలియజేస్తున్న చొక్కాకుల లక్ష్మీ వెంకటరావు

దాబాగార్డెన్స్ : డీసీసీబీ చైర్మన్‌గా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కోలా గురువులును పార్టీ బీసీ సెల్ విశాఖ జిల్లా అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గ నాయకుడు మన్యాల శ్రీనివాస్ గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మన్యాల మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారన్నారు. 2014 నుంచి పార్టీని నమ్ముకున్న కోలా గురువులును రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడమే గాక డీసీసీబీ చైర్మన్‌గా, మరీ ముఖ్యంగా జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పజెప్పడం చూస్తుంటే పార్టీని నమ్ముకున్న వారందరికీ కచ్చితంగా గుర్తింపు ఉంటుందని.. అందుకు ఆయనే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం సిటీ వైడ్ కృష్ణ అండ్ మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీసీహెచ్ అప్పారావు, పీలా ప్రేమ్ కిరణ్, బొండాడ వెంకట్రావు, గండి అప్పలరాజు, బొట్ట రాము, డొప్ప సూరిబాబు, మామిడి మోహన్, అంగటి సురేష్, బొడ్డు ధనరాజు, రాంబాబు, రవి, మహేష్, వద్దాది శివ, శేఖర్, ఉమామహేష్, కొండ బాబు తదితరులు పాల్గొన్నారు.

'కోలా'కు అభినందనల వెల్లువ..

మహారాణిపేట : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా, జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్‌గా నియమితులైన కోలా గురువులుకు మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో గురువారం అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో వి.కె.పి.సి.పి.ఐ.ఆర్. చైర్‌పర్సన్ చొక్కాకుల లక్ష్మీ వెంకటరావు, కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత సత్యనారాయణ, కనకమహాలక్ష్మి ట్రస్ట్‌బోర్డ్ చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, కార్పొరేటర్లు గుడివాడ సాయి అనూష లతీష్, డి.కొండబాబు, ఎండీ సాధిక్, జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజుబాబు, పేర్ల విజయ్ చందర్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు కె. రామన్నపాత్రుడు, ససపల భరత్, పద్మావతి, సుబ్రహ్మణ్యం, సువ్వాడ శ్రీదేవి, బుద్దల అనురాధ, సూరాడ వెంకటలక్ష్మీ దాస్, అద్దాల కృపాజ్యోతి, బొండా ఉమామహేశ్వరరావు , కేవీ బాబా, మన్యాల శ్రీనివాసరావు, వెంకటరమణారెడ్డి, బోని శివరామకృష్ణ, అప్పన్న, జగ్గపల్లి అప్పలరాజు, నారాయణరావు, చొక్కర శేఖర్, పీలా ప్రేమ్‌కిరణ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పోర్టు అధికారులను నిలదీసిన కార్పొరేటర్ సాధిక్

జగదాంబ : జ్ఞానాపురం ఫ్లైఓవర్ నుంచి పోర్టులోకి వెళ్లడానికి నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణం జరుగుతోంది. పోర్టులోకి భారీ వాహనాలు వెళ్లడానికి అనుకూలంగా ఈ నిర్మాణం చేపట్టారు. దీనికి మధ్యలో సముద్రంలోకి మురుగు నీరు ప్రవేశించే ఎస్‌ఎల్ కెనాల్ ఉంది. రహదారి నిర్మాణం కోసం కెనాల్ వద్ద మట్టి తీసుకొచ్చి అడ్డుగా వేశారు. దీంతో నీటి ప్రవాహానికి అడ్డుకట్ట పడింది. దీనివల్ల బుధవారం కురిసిన వర్షానికి పాతనగరం ముంపునకు గురి కావడంతో గురువారం ఉదయాన్నే సాధిక్ ఇక్కడి ఎస్‌ఎల్ కెనాల్‌ను పరిశీలించి పోర్టు అధికారులతో మాట్లాడారు. ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్ తీసుకోకుండా ఎందుకు పనులు చేస్తున్నారని పోర్టు అధికారులను ప్రశ్నించారు. ఇటువంటి చర్యల వల్ల ఎందరో పేదల ఇళ్లు నీట మునిగి నిరాశ్రయులు అయ్యారన్నారు. నీటి ప్రవాహాలను అడ్డుకోవడం నేరమని, దీనిని పోర్టు అధికారులు గమనించాలన్నారు. పోర్టు అధికారులే దీనికి బాధ్యత వహించాలన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన


సర్కిల్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

అల్లిపురం : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఇప్పటికే పలుమార్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చిన నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం గ్రీన్ పార్క్ హోటల్ దరి సర్కిల్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి లంచ్ అవర్ డిమాన్‌స్ట్రేషన్‌లో భాగంగా నినాదాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ విద్యుత్ ఉద్యోగుల యూనియన్ 1104 డిస్కమ్ సెక్రటరీ వీఎస్‌ఆర్‌కే గణపతి మాట్లాడుతూ గతంలో కార్మిక సంఘాలతో కుదుర్చుకున్న ఒప్పందాలను తప్పనిసరిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులలో నెలకొన్న అభద్రతా భావాన్ని తొలగించడంతో పాటు, ముఖ్యమైన సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యల పరిష్కారం నిమిత్తం ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమం శుక్రవారం కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. నిరసన కార్యక్రమాల్లో భాగంగా దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యుత్ కార్మికులు నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

అల్లిపురం : జీవీఎంసీ 34వ వార్డులో మంచినీటి సమస్య పరిష్కారానికి త్వరలోనే చర్యలు తీసుకోనున్నట్లు కార్పొరేటర్ తోట పద్మావతి స్పష్టం చేశారు. వార్డులో ఇప్పటికే పలు సమస్యలు పరిష్కరించామన్నారు. మంచినీటి సమస్య పరిష్కారానికి 1000 కేఎల్ కెపాసిటీ గల వాటర్ ట్యాంక్ నిర్మించాలని కౌన్సిల్‌లో మేయర్ హరివెంకటకుమారికి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతిపత్రాలు అందజేశామని వార్డు ప్రజలకు వివరించారు. గురువారం ఆమె వార్డులోని నేతాజీనగర్‌లో పర్యటించారు. స్థానికులు మంచినీటిలో వ్యర్థాలు కలుస్తున్నాయని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె క్షేత్రస్థాయిలో పర్యటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట వార్డు సీనియర్ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావు, తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.


నేతాజీనగర్ ప్రజలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ తోట పద్మావతి

క్లుప్తంగా

కనకమహాలక్ష్మిని దర్శించుకున్న ఎమ్మెల్యే వాసుపల్లి


అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : సిరులతల్లి కనకమహాలక్ష్మిని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి, ఎమ్మెల్యేచే అమ్మవారికి విశేష పూజలు చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు అనురాధ, సతీష్, సుబ్రహ్మణ్యం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దీవిని తలపిస్తున్న వర్షం నీరు


ఈత కొడుతూ.. ఎంజాయ్ చేస్తూ..

దాబాగార్డెన్స్ : ఆ ప్రాంతం ఓ దీవిని తలపిస్తోంది. అలాంటి దీవిలో కొంత మంది కుర్రకారు ఎంజాయ్ చేస్తూ 'సాక్షి' కంటపడ్డారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నగరంలో కురుస్తున్న వర్షాలకు బీచ్‌రోడ్డు కోస్టల్ బ్యాటరీ డౌన్ నేవల్ క్వార్టర్స్‌కు ఎదురుగా గల బీచ్‌లో సముద్రం నీటితో పాటు వర్షం నీరు కూడా పెద్ద ఎత్తున చేరడంతో ఓ దీవిలా ఏర్పడింది. అందులోమత్స్యకార బాలలు గురువారం స్విమ్మింగ్ చేస్తూ.. ఫుట్‌బాల్ ఆడుతూ సందడి చేశారు. చుట్టూ పచ్చని మొక్కలు..ఇసుకతిన్నెల మధ్య ఏర్పడిన దీవిని చూసి పలువురు ఆకర్షితులయ్యారు.

ఫిల్మ్ ఫెడరేషన్ కార్యవర్గ సభ్యుడిగా 'నరవ'


నియామక పత్రం స్వీకరిస్తున్న నరవ ప్రకాశరావు

మద్దిలపాలెం: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు ఫిల్మ్ ఫెడరేషన్ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. గత రెండు రోజులుగా హైదరాబాద్‌లో జరిగిన ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీ సదరన్ రీజియన్ వార్షిక సమావేశం సారథి స్టూడియోలో జరిగింది. ఈ సమావేశాలకు ఆంధ్ర, తెలంగాణతో పాటు, కర్ణాటక, పాండిచ్చేరి, తమిళనాడు రాష్ట్రాల ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు హాజరయ్యారు. పరిశ్రమతో పాటు ప్రేక్షకుల్లో వచ్చిన మార్పులపై చర్చించినట్లు నరవ తెలిపారు. ఈ ఎన్నికల్లో తాను కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యాయని నరవ తెలిపారు.

'భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి విశాఖ తోడ్పాటు'

బీచ్‌రోడ్డు: భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి తోడ్పాటు అందించే సామర్థ్యం విశాఖపట్నానికి ఉందని హరి కృష్ణ గ్రూప్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ ఘనశ్యామ్ ధోలాకియా తెలిపారు. హరి కృష్ణ గ్రూపు ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని ఓ హోటల్‌లో గురువారం క్లస్టర్ మీట్ నిర్వహించారు. ఫ్రాంచైజ్ మోడల్ ద్వారా వ్యాపార వృద్ధిని పెంచుతూ అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కిస్నా ఏపీ రీజనల్ మేనేజర్ మహేష్ గందానీ, పరాగ్ షా, నికుంజ్ కోరట్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ఎంవీపీ కాలనీ: వాసవీ క్లబ్ ఎంవీపీ కపుల్స్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాలలో గురువారం డిగ్రీ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ రీజనల్ చైర్మన్ సాంబమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర, విశాఖకు ద్రోహం చేస్తున్న బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

దాబాగార్డెన్స్ : ఆంధ్ర రాష్ట్రానికి విభజన హామీలు అమలు చేయడంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో లేదని, విశాఖకు, రాష్ట్రానికి బీజేపీ తీరని ద్రోహం చేస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె. లోకనాథం ఆరోపించారు. పోరాడి సాధించుకుందామన్న పట్టుదల ప్రజా ప్రతినిధులకు లేకపోవడం దురదృష్టకరమన్నారు. సీపీఎం కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలపై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్న బీజేపీని ప్రతిఘటించకపోవడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో ఆంధ్ర, తెలంగాణ పార్లమెంట్ సభ్యులు వేసిన ప్రశ్నలకు హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ సమాధానమిస్తూ విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు రూ.106.89 కోట్లు గత నవంబరులో కేటాయించినట్టు తెలిపారు. ఈ బడ్జెట్‌లో రూ.10 కోట్లు మాత్రమే కేటాయించామని చెప్పారు. ఇది అత్యంత ద్రోహమని, దీన్ని బట్టి విశాఖ రైల్వే జోన్ పట్ల బీజేపీకి చిత్తశుద్ధి ఏమిటన్నది అర్థమవుతుందన్నారు. ఇక్కడున్న బీజేపీ నాయకులు డీపీఆర్ తయారైపోయిందని, దీనికి స్పెషల్ ఆఫీసర్ కేటాయించారని ఊకదంపుడు ఉపన్యాసాలు గుప్పిస్తుండడం సిగ్గు చేటన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ స్ట్రాటజిక్ సేల్ పేరిట అమ్మకానికి పూనుకుంటున్నట్టు మరోసారి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామ్ ప్రకటించడం పచ్చి దుర్మార్గపు చర్యగా పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు, కడప స్టీల్‌ప్లాంట్, రామాయపట్నం పోర్టులకు కేంద్రం పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ఈనెల 28న విశాఖ వస్తున్నట్టు తెలిసిందని, కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ద్రోహంపై ముందు ఉత్తరాంధ్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆర్‌కేఎస్‌వీ కుమార్, వి. కృష్ణారావు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన బాధాకరం


నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

దాబాగార్డెన్స్ : మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న దమనకాండ దారుణమంటూ బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్, బీఎస్ఎన్ఎల్ వర్కింగ్ వుమెన్ కో ఆర్డినేషన్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం దాబాగార్డెన్స్ బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మణిపూర్‌లో జరుగుతున్న దాడులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిటు మహిళా సంఘం నాయకురాలు పి. మణి, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సంఘం నాయకులు పీఈసీహెచ్‌వీ సాగర్, మీనాకుమారి, వర్కింగ్ వుమెన్ కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే వాసుపల్లి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్ : ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం నియోజకవర్గ పరిధి పలు వార్డుల్లో ఆర్థిక ఇబ్బందులతో ఉన్న పలువురికి రూ.25 వేలు అందజేశారు. 30వ వార్డు కోడిపంద్యాలవీధి ప్రాంతానికి చెందిన బండి అప్పలస్వామికి రూ.5 వేలు, కొత్తజాలారిపేటకు చెందిన వాడమోదుల సత్యనారాయణకు రూ.5వేలు, 37వ వార్డు గొల్లవీధి భజన కోవెల ప్రాంతానికి చెందిన బమ్మిడి రామచంద్రరావుకు రూ.5 వేలు, 35వ వార్డు ప్రసాద్‌గార్డెన్స్‌కి చెందిన పోలవరపు రమణమ్మకు రూ.3 వేలు, కె. తులసికి రూ.2 వేలు, వాసుపల్లి ఝాన్సీకి రూ.2 వేలు, కోరండి ఆదమ్మకు రూ.వెయ్యి, ఒనుము మాణిక్యంకు రూ.వెయ్యి, కొత్త జాలారిపేటకు చెందిన వాడమోదుల తాతాజీకి రూ.వెయ్యి అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కోడూరు అప్పలరత్నం, విల్లూరి భాస్కరరావు, నాయకులు దశమంతుల మాణిక్యాలరావు, శంకాభక్తుల సన్యాసిరావు, మీసాల అశోక్‌కుమార్, పెంటపల్లి సత్యనారాయణ, ఖాజావలీ, చిన్ని, ఆదివిష్ణు, బొగ్గు శ్యామ్, మంగరాజు, గౌరీశంకర్, వద్దాది దిలీప్, కాసారపు వాసు, రాము, రామరాజు, వేణు, సతీష్, బద్రి కొండబాబు, సురేష్, శ్రావణ్, రంగాల రవికుమార్, కొట్యాడ గంగాధర్, గండిబోయిన రమణ, తర్లాడ శివ, నగేష్, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక వర్క్‌షాప్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులకు ఉన్నత్ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. సోషల్ వర్క్ విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో 'గ్రామీణ ప్రాంతాలలో ఏ విధమైన కార్యక్రమాలు నిర్వహించాలి' అనే అంశంపై అవగాహన కల్పించారు. యూబీఏ రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.పావని మాట్లాడుతూ గ్రామాల్లో యూబీఏ నిర్వహిస్తున్న కార్యక్రమాలను తెలియజేశారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య ఎస్. హరనాథ్, పార్టిసిపేటింగ్ ఇన్‌స్టిట్యూట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.సోని హవీల, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి తిరుప్పావడ సేవ


బీవీకే కళాశాల విద్యార్థులతో చేపట్టిన శ్రీనివాస గద్య సమర్పణ విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విశాఖ సాగరతీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ మాట్లాడుతూ ఆగస్టు 2వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.

ఎంవీపీ కాలనీ: విశాఖ సాగర తీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న శ్రీవారి శ్రావణ మాసోత్సవ సప్తాహం కార్యక్రమాలు గురువారం ప్రారంభమయ్యాయి. వైదిక ధర్మ ప్రకారం ఈ సంస్థలు ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపంలో ఆధ్యాత్మిక, శ్రీవారి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం శ్రీవేంకటేశ్వరస్వామికి తిరుప్పావడ సేవ వైభవంగా నిర్వహించారు. శ్రీవారి చిత్రపటానికి ప్రత్యేక అలంకరణతో పాటు విశిష్ట పూజలు చేశారు. వివిధ రకాల పూలు, ఆహార పదార్థాలు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం కార్యక్రమంలో భాగంగా

ఆంధ్ర టెక్ లీగ్ పోస్టర్ విడుదల

ఏయూ క్యాంపస్: సాంకేతిక రంగంలో యువతను ప్రోత్సహించేలా ఆంధ్ర టెక్ లీగ్ నిర్వహిస్తున్నట్టు టెక్ టీం సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఫైనల్ పోటీలు ఏయూ ఎ హబ్ వేదికగా అక్టోబర్ 1న నిర్వహించనున్నారు. డిజైన్ థింకింగ్, త్రీ డీ ప్రింటింగ్, కోడింగ్, రోబోటిక్స్, డ్రోన్స్, హ్యూమనాయిడ్ రోబోట్ అంశాల్లో ఈ పోటీలు జరుగుతాయని సంస్థ ప్రతినిధులు తెలియజేశారు. పాఠశాల విద్యార్థులు, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనవచ్చునని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టెక్ టీం సొల్యూషన్స్ నిర్వాహకులు ఎస్.వెంకటరెడ్డి, ఎ హబ్ సీఈవో రవి ఈశ్వరపు, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు కోతకు గురైన తీరం

బీచ్ రోడ్డు: భారీ వర్షాలకు సముద్ర తీరం కోతకు గురైంది. బీచ్‌లోని పిల్లల పార్కు, కొబ్బరి చెట్ల వద్ద ఏర్పాటు చేసిన భద్రత గోడ భారీ అలలకు కొట్టుకుపోయింది. అలల ఉధృతికి ఇసుక మొత్తం కోరుకుపోయి తీర ప్రాంతం అస్తవ్యస్తంగా కనిపిస్తోంది.


అస్తవ్యస్తంగా తీర ప్రాంతం